వణికిస్తున్న వాన

- పొలాల్లో వర్షపు నీరు
- ఆందోళనలో రైతులు
- అప్రమత్తం చేస్తున్న అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురంలో వరి పనలు పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. తుఫాన్ ప్రభావం అంతగా లేకున్నా మంగళవారం రోజంతా వాన కురవడంతో పొలాల్లో నీరు చేరింది. దీంతో వరి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కోతలు పూర్తయి పొలాల్లో ఉన్న వరి పనలకు నష్టం జరుగుతోంది. ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం, భగీరథపురం, పొన్నాడ, తోటపాలెం, కుశాలపురం, ఇబ్రహీంబాద్, పూడివలస తదితర ప్రాంతాల్లో పంట కాపాడుకునేందుకు రైతులు ప్రయాసలు పడ్డారు. పంట తడిచిపోవడంతో ధాన్యం నాణ్యతపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలేం గ్రామాల్లో మత్స్యకారులు వాతావరణం అనుకూలించక వేట సాగించలేకపోయారు. ఫలితంగా రోజు వారి జీవన భృతికి దూరమయ్యారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను సచివాలయాల వారీగా సేకరిస్తున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ, వ్యవసాయాధికారి సురేష్ తెలిపారు. తుఫాన్ తీవ్రత తక్కువగానే ఉందని అధికారులు చెప్పారు. ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మరో రెండు రోజులు ప్రభావం..

గార: తుఫాన్ తీరం దాటిన నేపథ్యంలో మరింతగా వర్షాలు కురిసే అవకాశమున్నందున రెండు రోజుల పాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మంగళవారం సతివాడ, నిజామాబాద్, దీపావళి, లంకపేట, సుంకరిపాలేం, తంగుళ్లపేట వంటి పల్లపు ప్రాంతాలతో పాటు బందరువానిపేట, కొమరవానిపేట తీర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు ఇవ్వాలని, పంట జాగ్రత్త విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవ రమణయ్య, తహశీల్దార్ జెన్ని రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పీస శ్రీహరిరావు, సిమ్మ ధర్మరాజు, ఏవో దుంపల పద్మావతి, గుజ్జల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తం..

రణస్థలం: తుఫాన్ తీరం దాటిన నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ అన్నారు. అల్లివలసలో పర్యటించి మత్స్యకారులతో మట్లాడారు. పడవలు, వలలకు ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మరో రెండు రోజులు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, చేపల వేటకు వెళ్లవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో గంగాధర్, డీపీఎం షణ్ముఖరావు, అల్లివలస ఉప సర్పంచ్ ఎం.సోమయ్య, కన్వీనర్ ఎం.పొట్టివాడు, సచివాలయ అసిస్టెంట్ అనూషా తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి..

జి.సిగడాం: తుఫాన్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రైతులు వరి పంటను భద్రపరుచుకోవాలన్నారు. డయేరియా, డెంగీ, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున శుభ్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



జి.సిగడాం: సిబ్బందితో చర్చిస్తున్న తహసీల్దార్ వేణుగోపాలరావు



గార: మత్స్యకారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహీంబాద్‌లో తడిచిన వరి పనలు



ఎచ్చెర్ల క్యాంపస్: జరజాంలో ఉప్పునీటిని పిచికారీ చేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేటలో తడిచిన ఇటుక బట్టీ



ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలో పొలాల్లో వరికుప్పలు



గార: తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న ఎంపీపీ రఘురామ్, అధికారులు



రణస్థలం: అల్లివలసలో మత్స్యశాఖ అధికారుల బృందం

క్లుప్తంగా

శక్తిపథ ఆంజనేయునికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన శక్తిపథ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: తాడేపల్లిగూడెంలో ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం అందిందని ప్రముఖ కవి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రికార్డు కోసం ఏకధాటిగా 30 గంటల పాటు కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి ఆహ్వానం పంపించారని తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

లావేరు/ఎచ్చెర్ల: మండలంలోని గుమడాం పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ జి.పైడయ్య, ఉప సర్పంచ్ డి.ధర్మారావు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటా మంచినీటి కుళాయి ఏర్పాటు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమడాం, వేణుగోపాలపురం, వాళ్లేపేట, నాగంపాలెం గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జగ్గరోతు తవిటినాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏఓ శారద

జి.సిగడాం: భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి యర్రా శారద అన్నారు. మంగళవారం మెట్టవలస, పాలఖండ్యాం గ్రామాల్లో జాతీయ భూసార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలో పోషక విలువలను గుర్తించి పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొగిరి నారాయణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక



తమ్మినేని అభిషేక్

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ వెంకటాపురానికి చెందిన తమ్మినేని అభిషేక్ ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ట్రిపుల్‌ఈ) పూర్తిచేశాక పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఎస్‌ఎస్‌సీ సీజీఎల్-2022 రిక్రూట్‌మెంట్‌లో కాగ్ ఆడిటర్‌గా సెలక్టయ్యాడు. ఈ ఫలితాలు మేలో విడుదల కాగా వారం కిందట విజయవాడ కార్యాలయంలో ప్లేస్‌మెంట్ ఇచ్చారు. ఇంకా పోస్టులో చేరకముందే మంగళవారం విడుదలైన ఎస్‌ఎస్‌సీ సీజీఎల్- 2023 ఫలితాల్లో కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి వాసుదేవరావు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, తల్లి శశిరేఖ గృహిణి. పొందూరు మండలం కొకర్లపల్లికి చెందిన వీరు ప్రస్తుతం వెంకటాపురంలో స్థిరపడ్డారు.

నేలను కాపాడుతూ పంటలు పండించాలి



విత్తనాలు, ఎరువులను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: భవిష్యత్తు తరాలు లక్ష్యంగా నేలను కాపాడుతూ పంటలు పండించేలా మార్పులు అవసరమని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. సంత సీతారాంపురంలోని సైక్ వ్యవసాయ కళాశాలలో మంగళవారం 'ప్రపంచ నేల దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలను రక్షించాలంటే రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగం తగ్గాలన్నారు. భూసారాన్ని పరీక్షించి అవసరం మేరకే ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. పంటల మార్పిడి జరగాలన్నారు. విత్తన ఎంపిక, ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉద్యానవన, కూరగాయలు సాగు లాభదాయకమని చెప్పారు. సేంద్రియ సాగుపై రైతుల్లో చైతన్యం పెంచాల్సిన బాధ్యత వ్యవసాయ విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం రైతులకు మేలు జాతి విత్తనాలు, ఎరువులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ డీకేసీ దీక్షిత, డాక్టర్ కేపీఎస్‌ఎస్ రాజ్‌రుషి తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక సుస్థిరత



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్

ఆమదాలవలస: రాష్ట్ర ప్రజల సామాజిక సుస్థిరతకు కులగణన దోహదపడుతుందని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, తహసీల్దార్ల అధ్యక్షతన కులగణన సర్వే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజా అభివృద్ధిలో కులగణన ముఖ్య భూమిక వహిస్తుందన్నారు. సర్వే చేసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఇంటింటికీ వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.గణపతిరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, నాయకులు డి.శ్యామలరావు, ఎ.ఉమామహేశ్వరరావు, జె.కె.వెంకటేశ్వరరావు, ఎస్.కామేశ్వరరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

భూమిని సంరక్షించుకోవాలి

జలుమూరు: భూమిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తిమడాం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. భూమి తన స్వభావం కోల్పోకుండా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ఎంపీపీ వాన గోపి, ఏడీ రవీంద్రభారతి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఏఓ కె.సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాము, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్ సత్యవతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అసిరినాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: భూమిని సంరక్షించాలని ఏఓ మెట్ట మోహన్‌రావు అన్నారు. ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దూసి రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొందరు రైతులు అవగాహన లేక రసాయనిక ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. ఏఈఓ రమణమూర్తి, వీఏఏ టి.అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: భూమిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచే బాధ్యతను తీసుకోవాలని లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కె.మిశ్రో కోరారు. ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సం సందర్భంగా మామిడి మొక్కలను పంపిణీ చేశారు.

చిన్నారి వైద్యానికి అండగా..



చిన్నారి గాయత్రితో మాట్లాడుతున్న ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం : నగరంలోని దమ్మలవీధికి చెందిన పుక్కల రాజు ఐదేళ్ల కుమార్తె గాయత్రి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు తిరుపతిలో ఉన్న చిల్డ్రన్ హార్ట్ ఆస్పత్రి వైద్యుడు శ్రీనాథ్‌రెడ్డితో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గాయత్రి తండ్రి రాజుకు ధైర్యం చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సారవకోట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహసీల్దార్ హనుమంతరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నివారణపై ఐసీడీఎస్, ఐసీడీపీఎస్ ఆధ్వర్యంలో మండల కమిటీ ప్రతినిధులు మంగళవారం సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై సచివాలయ సిబ్బంది, ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రాంబాబు, సీడీపీఓ హెచ్.కె.కామాక్షి, ఈఓపీఆర్డీ రేణుక, ఎంఈఓ ఎం.వి.రమణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత

జలుమూరు: బాలల రక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో స్త్రీ సంక్షేమ శాఖ-చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. బాలలను పనిలో పెట్టడం నేరమన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, వీటిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ బి.సత్యం, సీడీపీఓ హెచ్.కె.కామక్షి, పర్యవేక్షకులు పైల సునీత పాల్గొన్నారు.

కొత్త ఓటర్లుగా 1296 మంది నమోదు



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగయ్య

శ్రీకాకుళం రూరల్: గత రెండు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా గార, శ్రీకాకుళం నియోజకవర్గాలకు సంబంధించి ఫారం-6లో 1296 మంది నమోదైనట్లు ఆర్డీఓ సీహెచ్ రంగయ్య తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6,7,8 కలిపి శ్రీకాకుళం నియోజకవర్గంలో 2,400 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇంకా అర్హులు ఉంటే ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వెంకటరావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు



జలుమూరు: అల్లాడపేట వద్ద వాహనాలకు ధాన్యాన్ని లోడింగ్ చేస్తున్న రైతులు, కూలీలు



కొత్తూరు: కుంచాలపేట రైస్ మిల్లుకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ

జలుమూరు: మండల పరిధిలో 24 రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు రైస్ మిల్లులకు వాహనాలతో తరలించారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో మంగళవారం కూడా ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటివరకు 650 క్వింటాళ్ల ధాన్యాన్ని గత మూడు రోజులుగా కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రోడ్లుపై ఉన్న ధాన్యంతోపాటు కల్లాలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వాహనాలతో రైస్ మిల్లులకు రవాణా చేస్తున్నామన్నారు.

1,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

కొత్తూరు: మండలంలో సుమారు 1,200 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు ఏఓ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కుంచాలపేటలోని రైస్ మిల్లుకు పంపించారు.

పాల ఉత్పత్తిని పెంచాలి

పాతపట్నం: పాడి పశువుల యాజమాన్యంలో కొత్త పద్ధతులు అవలంబించి తద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలోని సీది గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శాస్త్రీయ పద్ధతులు ఎప్పటికప్పుడు పశువైద్యాధికారుల ద్వారా తెలుసుకోవాలన్నారు. చూడు పశువుల పోషణ, కృత్రియ గర్భాధారణ, పశుగ్రాసాల ప్రాముఖ్యత, దూడల పోషణలో యాజమాన్య పద్ధతులు, వ్యాధి నిరోధక టీకాలతోపాటు పలు అంశాలను పాడి రైతులకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశుసంవర్ధకశాఖ పథకాల గురించి తెలియజేశారు.